విద్యావేత్తను గెలిపిస్తేనే అభివృద్ధి

• కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు



న్యాయవాదులతో కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: విద్యావేత్తను గెలిపిస్తేనే కరీంనగర్ అభివృద్ధి చెందటంతోపాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని న్యాయవాదులు అన్నారు. మంగళవారం కరీంనగర్ కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ మీటింగ్ హాల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సమావేశం నిర్వహించారు. ఉన్నత విద్యతోపాటు సేవాభావం, విజినరీ ఉన్న రాజేందర్‌రావును గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వెలిచాల మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలను చైతన్యపరచడంలో న్యాయవాదులు ముందుంటారని, కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్న తనను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘువీర్, కార్యదర్శి బీమా సాహెబ్, కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు ఆర్.దేవేందర్ రెడ్డి, పీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, సీనియర్ న్యాయవాదులు రాచకొండ ప్రభాకర్, పెంచాల లక్ష్మణరావు, కిరణ్ కుమార్, కట్టా రమేశ్, మంద రమేశ్‌గౌడ్, కుమారస్వామి, కొలకాని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌ను కలిసిన 'బండి'

• ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరిన బీజేపీ అభ్యర్థి



న్యాయవాదులతో మాట్లాడుతున్న సంజయ్

కరీంనగర్‌టౌన్: జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు అందించిన సహకారంతోనే అలుపెరగని పోరాటాలు చేసి, ఈ స్థాయికి ఎదిగానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. అరెస్టైనప్పుడల్లా తనకు బెయిలిప్పించి, ప్రోత్సహించిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కరీంనగర్ జిల్లా న్యాయస్థానం వద్ద బార్ అసోసియేషన్ నాయకులను కలిశారు. ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కోర్టు వద్దకు వస్తే.. తాను అరెస్టయి, బెయిల్ కోసం వచ్చినట్లుగా ఉందని సరదాగా వ్యాఖ్యానించారు. తాను ఎంపీగా ఐదేళ్లలో రూ.12 వేల కోట్లు తెచ్చి, అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. గరీబోళ్ల బిడ్డకు, గడీల వారసులకు మధ్య జరుగుతున్న పోరులో మీరంతా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు ప్రస్తావిస్తా

• బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కరీంనగర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని బీఆర్‌ఎస్ పార్లమెంట్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి, వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కార్మికులు మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిపై చేస్తూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తనను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వ రంగ గ్యాస్ కంపెనీల ద్వారా సిలిండర్లు ఇచ్చేలా కొట్లాడుతానని హామీ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎంపీగా ఉన్నప్పుడు కూడా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తే కొన్ని పరిష్కారానికి నోచుకున్నాయని పేర్కొన్నారు.

ఆశీర్వదించి, పార్లమెంట్‌కు పంపించండి

పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి, పార్లమెంట్‌కు పంపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని 7వ డివిజన్ పరిధి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పదేళ్లల్లో చేసిన అభివృద్ధిని గుర్తించి, ఎంపీ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగరశాఖ చల్ల హరిశంకర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారదాసు వసంతరావు, గూడెల్లి రాజ్‌కుమార్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వండి



కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

సప్తగిరికాలనీ: ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ఏఈఆర్వో ద్వారా డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతి రెడ్డి, జైపాల్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. ఎండలు మండుతున్న దృష్ట్యా పోలింగ్ బూత్‌లలో కూలర్లు, చల్లని నీటిని ఏర్పాటు చేయాలని కోరారు.

ఉత్సాహంగా 5కె రన్



రన్‌లో పాల్గొన్న యువత

కరీంనగర్ స్పోర్ట్స్: ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలో నిర్వహించిన 5కె రన్ ఉత్సాహంగా సాగింది. కార్యక్రమాన్ని ఉదయం కలెక్టరేట్ ఎదుట స్వీప్ నోడల్ అధికారి ఎస్.రామాచారి జెండా ఊపి, ప్రారంభించారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లందరూ విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. కాగా, రన్ కలెక్టర్ కార్యాలయం నుంచి కమాన్, కోతిరాంపూర్ మీదుగా తిరిగి కలెక్టరేట్‌కు చేరుకుంది. కార్యక్రమంలో మెప్మా పీడీ రవీందర్, యువత తదితరులు పాల్గొన్నారు.

'ఓటమి ఖరారవడం వల్లే రాహుల్ గాంధీ పర్యటన రద్దు'

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓటమి ఖరారవడం వల్లే రాహుల్ గాంధీ పర్యటన రద్దు చేసుకున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొట్టె మురళీకృష్ణ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల అనంతరం ఆచూకీ తెలియని నేతగా కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు నిలుస్తారని ఎద్దేవా చేశారు. ప్రజాదరణ లేక కేవలం ధన ప్రవాహంతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. సంతలో సరుకుల్లా కార్పొరేటర్లను, ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, అది తమకు ఎన్నికల ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలి



ప్రచారం చేస్తున్న నాయకులు

కరీంనగర్: బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు కెంసారం తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినోద్‌కుమార్ కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తీసుకువచ్చారని, జాతీయ రోడ్లు, రైల్వేలైన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. మరింత అభివృద్ధి జరగాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కన్నం శ్రీనివాస్, సత్తయ్య, అశోక్, చంద్రం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నటి ధార.. బిందె నిండేదెలా?

• ఎల్‌ఎండీలో తగ్గిన నీటిమట్టం
• నగరంలో నీటి ఎద్దడి
• రోజు విడిచి రోజు, రెండు రోజులకోసారి నీటి సరఫరా
• మారుతీనగర్‌లో బిందె నిండేందుకు అరగంట సమయం



సన్నటి ధారలా వస్తున్న మున్సిపల్ నల్లా నీరు

కరీంనగర్ కార్పొరేషన్: ఈ వేసవిలో కరీంనగర్ నగరవాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఎల్‌ఎండీలో నీటి మట్టం తగ్గడంతో ప్రతిరోజూ నీటి సరఫరా వీలుపడటం లేదు. ప్రస్తుతం రోజు విడిచి రోజు, కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకోసారి ఇస్తున్నారు. అయితే, వస్తున్న నీళ్లు కూడా సరిపడా రాకపోవడం, సరైన ప్రెషర్ లేకపోవడం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే, నగరంలోని 30వ డివిజన్ పరిధి మారుతినగర్‌లో కొత్త సమస్య నెలకొంది. నగరంలో 24 గంటల తాగునీటి సరఫరా చేసేందుకు స్మార్ట్‌సిటీలో భాగంగా నగరపాలక సంస్థ గతంలోనే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ రిజర్వాయర్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీ, మారుతినగర్, షాషామహల్, గాయత్రినగర్ తదితర ప్రాంతాల్లో నల్లాలకు మీటర్లు బిగించే కార్యక్రమం కొనసాగుతోంది. కాంట్రాక్టు పొందిన ఏజెన్సీ మీటర్లు బిగించడం ప్రారంభించింది. అయితే, వాటిపై ఆయా కాలనీల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మీటర్లు బిగించే సిబ్బందితో కొంత మంది వాగ్వాదానికి దిగుతున్నారు. అయితే, మారుతినగర్‌లో మీటర్లు బిగించిన నల్లాల నుంచి సన్నటి ధారగా నీరు వస్తోంది. ఒక బిందె నిండటానికి అరగంట సమయం పడుతోందని మహిళలు వాపోతున్నారు. మీటర్లు బిగించే క్రమంలో రెండున్నర ఫీట్ల నుంచి మూడు ఫీట్ల ఎత్తులో నల్లాను బిగించడం వల్ల సమస్య తీవ్రత పెరిగినట్లు చెబుతున్నారు. నల్లా ఎత్తుగా అమర్చడం, నీరు ప్రెషర్‌తో రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండటంతో నీటి వినియోగం పెరిగిందని, ఈ సమయంలో రోజు విడిచి రోజు అదీ సన్నటి ధారగా వస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు దృష్టి పెట్టి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తాం

• అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శివపల్లి రాజేశం



మాట్లాడుతున్న రాజేశం

కరీంనగర్ కార్పొరేషన్: పార్లమెంట్ ఎన్నికల్లో తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శివపల్లి రాజేశం తెలిపారు. మంగళవారం నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కరీంనగర్ లోకసభ నియోజకవర్గ పరిధిలో 1.10 లక్షల ఓట్లు తమ సామాజిక వర్గానికి చెందిన వారివి ఉన్నాయని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ విశ్వకర్మలను ఓటు బ్యాంకుగా వాడుకున్నాయే తప్ప, తమ సంక్షేమానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, బీఆర్‌ఎస్ హయాంలో తమకు కష్టాలు, కన్నీళ్లు మాత్రమే మిగిలాయన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ చొరవ చూపడం వల్లే తెలంగాణ ఉద్యమం మొదలైందని, శ్రీకాంతాచారి బలిదానం వల్లే తెలంగాణ కల సాకారమైందని పేర్కొన్నారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాలాచారి, మహిళా విభాగం కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు మోహన్, రాజేశం, నారాయణ స్వామి తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు నాయీబ్రాహ్మణ ఐక్య వేదిక మద్దతు



ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతు పలుకుతున్న ఐక్య వేదిక నాయకులు

కరీంనగర్: తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, నాయకులు కరీంనగర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేదిక తరఫున మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధి అంతా తాను ఎంపీగా ఉన్నప్పుడు చేసిందేనన్నారు. గత ఐదేళ్లుగా ఎంపీ బండి సంజయ్ కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని ఆరోపించారు. మతం పేరుతో యువకులను అయోమయానికి గురిచేశారని పేర్కొన్నారు. ఈసారి ఆయన మాటలు నమ్మే పరిస్థితిలో నియోజకవర్గ ప్రజలు లేరన్నారు. అలాగే, నాయీబ్రాహ్మణులు ఉద్యమ సమయం నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా ఉన్నారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవుదుర్తి విజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ మల్లెంకి శ్రీనివాస్, నగర కోశాధికారి శ్రీరాముల రమేశ్, నాయకులు నాగవెల్లి లక్ష్మణ్, సముద్రాల మధు, కల్యాణం శ్రీనివాస్, గర్శకుర్తి విద్యాసాగర్, కొత్వాల అశోక్, గుంజపడుగు పవన్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

మా నాన్నను ఎంపీగా గెలిపించండి

• కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి 'వెలిచాల' కూతుళ్లు



గోపాల్‌పూర్‌లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న రచన, రితిక

కరీంనగర్‌రూరల్: మా నాన్నను ఎంపీగా గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కూతుళ్లు రచన, రితిక కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్, దుర్శేడ్, ఇరుకుల్ల గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలను కలిసి, ఓటు అభ్యర్థించారు. ఎంపీగా గెలిపిస్తే రాజేందర్‌రావు చేయబోయే అభివృద్ధి పనులపై కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం దుర్శేడ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు, హమాలీలను కలిసి, మాట్లాడారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు కె.రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.తిరుపతి, నాయకులు బి.హరీశ్‌గౌడ్, తిరుపతి, కె.రాకేశ్, జె.మారుతీరావు, బి.శేఖర్, మురళి, లచ్చయ్య, రమేశ్, బాబుగౌడ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో సైకాలజిస్టుల పాత్ర గొప్పది

• తానా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సైకాలజిస్టులు

కరీంనగర్‌టౌన్: సమాజంలో యువతను సన్మార్గంలో నడిపించడంలో సైకాలజిస్టుల పాత్ర గొప్పదని తానా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని వాసుదేవ ఆస్పత్రిలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడికి లోనైన వారిలో ఆత్మస్థైర్యం నింపుతూ, ఆత్మహత్యలను నివారించి, వారిలో ధైర్యాన్ని పెంపొందించడం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. తెలంగాణ సైకియాట్రిస్టు అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ గాలిపల్లి మాట్లాడుతూ.. తాము విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 16 నుంచి ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలో వన్ లైఫ్ భరోసా ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీఏ ప్రతినిధులు అనురాధ, మెతుకు సత్యం, శ్రీనివాస్, భూమేశ్, వాణి, లలిత, అనిత, ఐలయ్య, సతీశ్, డాక్టర్ అహ్మద్ పాల్గొన్నారు.

బీఆర్‌టీయూ, ఆటో యూనియన్ ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

కరీంనగర్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ), జిల్లా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని పలు ప్రాంతాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందని, బీజేపీ ప్రభుత్వం మోటార్ వెహికల్ చట్టాలను మారుస్తూ డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయేలా చేసిందని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని కోరారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి, ఆటోడ్రైవర్లు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, నరసింహనాయక్, సత్యం, సంపత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆట వస్తువుల పంపిణీ



సామగ్రి పంపిణీ చేస్తున్న స్వప్న

సప్తగిరికాలనీ: కరీంనగర్ మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో కూలీ పని చేసుకునే కార్మికుల చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు చకిలం స్వప్న, నిర్వాహకులు చకిలం శ్రీనివాస్, రూప పాల్గొన్నారు.

భూమయ్య సేవలు మరువలేనివి

చొప్పదండి: మండల విద్యాధికారిగా బత్తుల భూమయ్య సేవలు మరువలేనివని, ఆయన అకాల మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య అన్నారు. మంగళవారం భూమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. దొంత రాజయ్య, కడారి గంగరాజు, అనంతయ్య తదితరులున్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



రేకుర్తిలో ప్రచారం చేస్తున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: రేకుర్తిలో బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర సంక్షేమ పథకాలు, ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధిని చూసి, బీజేపీకి ఓటు వేయాలని కోరారు. పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర జనరల్ సెక్రటరీ నిర్మలారెడ్డి, నాయకులు నాంపల్లి శంకర్, పింగిలి ప్రతాప్ రెడ్డి, నరసింహారెడ్డి, పీచర విష్ణుప్రసాద్‌రావు, గోదరి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో మహిళలదే పైచేయి



బొమ్మకల్‌లో ఉపాధిహామీ పనులు చేస్తున్న మహిళలు (ఫైల్)

• పనుల్లో పురుషుల కంటే వీరి సంఖ్యే ఎక్కువ
• కూలీ రూ.300కు పెంపుతో మరింత ఉత్సాహం
• కరీంనగర్ మండలంలో జోరుగా ఉపాధిహామీ పనులు

కరీంనగర్‌రూరల్: మారుతున్న కాలంలో మహిళలు ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఇంటిని చక్కదిద్దడమే కాకుండా తమవంతుగా కుటుంబ పోషణకు ఆసరాగా నిలుస్తున్నారు. అంతేకాకుండా పురుషులతో సమానంగా వ్యవసాయం, కూలీ పనుల్లోనూ కష్టపడుతున్నారు. పలుగు, పార చేత పట్టి, ఉపాధిహామీ పనులకూ వెళ్తున్నారు. కరీంనగర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో పనులు జోరుగా సాగుతున్నాయి. చెరువుల పూడికతీత, కందకాల తవ్వకం తదితర పనులకు పురుషుల కంటే మహిళలే ఎక్కువగా హాజరవుతున్నారు. ప్రధానంగా మొగ్దుంపూర్, నగునూరు, గోపాల్‌పూర్ గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో కూలీలు పనులకు వెళ్తున్నారు. కరీంనగర్ మండలంలో గత సోమవారం నుంచి శనివారం వరకు మొత్తం 11,915 మంది హాజరవగా వీరిలో 9 వేల మంది మహిళలే ఉన్నారు.

గిట్టుబాటు వేతనం, చేతినిండా పని

పథకం ప్రారంభించిన తొలినాళ్లలో ఎక్కువగా పురుషులు పనులకు వెళ్లేవారు. పురుషులకు, మహిళలకు కూలీ చెల్లింపు సమానంగా ఉండటంతో క్రమంగా మహిళలు హాజరవడం ప్రారంభించారు. చెరువుల పూడికతీత, మట్టిరోడ్ల నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. గిట్టుబాటు వేతనం, చేతినిండా పని లభిస్తుండటంతో వ్యవసాయ పనులతో పోల్చితే ఉపాధిహామీ పనులు చేసేందుకే మొగ్గుచూపుతున్నారు. వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో మహిళల హాజరు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అంతేకాకుండా గతంలో రోజుకు రూ.272 ఉన్న కూలీని ఈ నెల 1 నుంచి రూ.300 పెంచడంతో మరింత ఉత్సాహంతో వెళ్తున్నారు.

కూలీల సంఖ్య 10,246 మంది..

మొత్తం జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు 6,514, కూలీల సంఖ్య 10,246, పని చేస్తున్న కుటుంబాలు 4,232, పని చేస్తున్న కూలీలు 5,441 మంది, పనులకు హాజరవుతున్న మహిళలు 4,174, పురుషులు 1,267 మంది.

ఎంఈవో కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కరీంనగర్: ఎన్నికల విధుల్లో పాల్గొంటూ ఈ నెల 4న వడదెబ్బతో మృతిచెందిన వెల్గటూరు, ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి మండలాల ఎంఈవో బత్తుల భూమయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.ఖాద్రీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భూమయ్య గత నెల 18 నుంచి పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో స్టాటిస్టికల్ సర్వేలైన్స్ టీం సభ్యుడిగా పని చేస్తూ వడదెబ్బకు గురయ్యారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

బోర్డులపై పాత అధికారుల పేర్లేనా?



గ్రామస్తుల సౌకర్యార్థం ప్రతీ గ్రామపంచాయతీలో మండల, గ్రామ స్థాయి అధికారుల పేర్లతో ఏర్పాటు చేసిన బోర్డులు జీపీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. పలువురు అధికారులు బదిలీ అయి, ఏళ్లు గడుస్తున్నా కరీంనగర్ మండలంలో పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని బోర్డుల్లో వారి పేర్లే కనిపిస్తున్నాయి. కొంత మంది అధికారుల సెల్‌ఫోన్ నంబర్లు మారినప్పటికీ కొత్త నంబర్లు రాయలేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, అధికారుల పేర్లు, సెల్‌ఫోన్ నంబర్లను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్